క్లుప్తంగా

భక్తి ప్రపత్తులతో సత్యనారాయణ వ్రతం



ఆలయంలో సత్యనారాయణ వ్రతం ఆచరిస్తున్న భక్తులు

కాణిపాకం: పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైనా శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. తొలుత స్వామి వారికి అభిషేక పూజలు చేయించారు. తర్వాత అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం ఆచరించారు. అనంతరం వ్రతంలో పాల్గొన్న భక్తులకు స్వామి ప్రసాదం, పసుపు, కుంకుమం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బ్రహ్మానందాశ్రమంలో వ్రత పూజలు



శ్రీసత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో శుక్రవారం శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి మూల విగ్రహానికి ఆశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని మండపంపై కొలువు దీర్చి స్వామివారి వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సత్యనారాయణస్వామి వత్ర పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహక సభ్యులు, పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెరుకుతోట దగ్ధం



ఎగువ తడకర సమీపంలోని పొలంలో దగ్ధమైన చెరుకుతోట

తవణంపల్లె: మండలంలోని ఎగువ తడకర సమీపంలోని పొలంలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో శుక్రవారం చెరుకుతోట దగ్ధమైంది. బాధిత రైతు బేరి ప్రకాష్ కథనం మేరకు, రైతు ప్రకాష్ రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని, చెరుకుతోట సాగు చేశారు. ఎకరా చెరుకు తోట గానుగ ఆడారు. మిగిలిన తోట గానుగ ఆడాల్సి ఉంది. అంతలోనే పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర అగ్గిరవ్వలు పడడంతో చెరుకు ఆకులు అంటుకుని మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల రైతులు వచ్చి మంటలను అదుపు చేసే లోపల పూర్తిగా కాలిపోయింది. ఆకులు పూర్తిగా కాలిపోగా అక్కడక్కడ చెరుకు గడలు మాత్రం సగం కాలిపోయి కనిపిస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన చెరుకు పంట కళ్లెదుటే కాలిపోవడంతో రైతు కుటుంబం తల్లడిల్లిపోయింది. ప్రభుత్వం తమకు(కౌలు రైతుకు) ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ప్రాధేయపడ్డారు.

రంగుల సంబరం



చిత్తూరు నగరంలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో రంగులు చల్లుకున్నారు. కొందరు పొడిని, మరికొందరు రంగుల నీరుతో సంబరం చేసుకున్నారు. చిన్నారులు, పెద్దలు కలిసి అత్యంత ఉల్లాసంగా రంగులు చల్లుకుంటూ.. ఉత్సాహంలో మునిగిపోయారు. -కాణిపాకం

ఆశ్రమానికి విరాళం



చిత్తూరు నగరం ఈశ్వరగుడివీధిలోని శ్రీ రామకృష్ణ ఆశ్రమానికి శుక్రవారం దాత పార్థసారథి నాయుడు నగదు విరాళం అందించారు. ధూప దీప నైవేద్యం, నిత్యపూజ కైంకర్యాలకు గాను రూ. 10వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, సభ్యులు శరత్‌చంద్ర పాల్గొన్నారు. -కాణిపాకం

తుప్పు.. తుక్కు



పలు రకాల కేసుల్లో పట్టుబడిన వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపడుతున్నాయి. అక్రమ రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాలన్నీ గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో ఇలా మూలకు చేరాయి. ఇవి చివరికి తుక్కు (గుజిరీ) సామగ్రి దుకాణాలకు తూకం లెక్కన విక్రయించాల్సి వస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. -గుడిపాల

పిచికారీ.. జాగ్రత్త మరి!

- స్ప్రేయర్లు శుభ్రం చేసి భద్రపరచుకోవాలి
- రైతులు, వ్యవసాయ కూలీలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వరి పంటకు పురుగుల మందును స్ప్రే చేస్తున్న రైతులు

తవణంపల్లె: పంటల సాగులో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితేనే పండించిన పంట చేతికి అందుతోంది. సాగు సజావుగా సాగాలంటే సకాంలో నీరు సరిపడేలా అందించాలి. నీటి వనరుల లభ్యత, ఏ దశలో ఎంత మేరకు నీటి తడులు కట్టాలన్నదానిపై రైతులకు అవగాహన అవసరం. ఆ తర్వాత రైతులు పంటలకు అవసరం మేరకు ఎరువులు, పురుగుల నివారణకు మందులను పిచికారీ చేయాలనే విషయంపై దృష్టి సారిస్తారు. పంటలను కాపాడుకోవడానికి మందులను పిచికారీ చేసేటప్పుడు పంట సస్యరక్షణతో పాటు తమ ఆరోగ్యం రక్షణకూ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. వ్యవసాయ పనుల్లో కష్టపడి పని చేయడం అలవాటైనప్పటికీ పంటకు ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేసేటప్పుడు రైతు శారీరకంగా, మానసికంగా అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. మరీ ముఖ్యంగా మందులను పిచికారీ చేసే యంత్రాల వినియోగంలో అవగాహన అవసరం. క్రిమిసంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు వ్యవసాయ అధికారులు, వైద్యుల సూచనలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతులు పంటలకు చేపట్టే సస్యరక్షణ చర్యల్లో భాగంగా రసాయన ఎరువులు వేసేటప్పుడు, క్రిమిసంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. మండలంలో వరి పంట సుమారు 450 ఎకరాల్లో, మామిడి పంట 9,630 ఎకరాలు, మిరప పంట 45 ఎకరాల్లో సాగులో ఉంది.

స్ప్రేయర్లు వాడే విధానం

రైతులు పురుగు మందులు పిచికారీ చేసిన తర్వాత స్ప్రేయర్లను శుభ్రంగా మంచి నీటిలో కడిగి ఆరపెట్టాలి. మందులు పిచికారీ చేసేటప్పుడు గాలికి వాటంగా చేయాలి. స్ప్రేయర్లను ఆరబెట్టిన తర్వాత వాషర్లకు, పిన్నులకు ఆయిల్ వేసి భద్రపరచాలి. ఫుడ్ స్ప్రేయర్, బ్యాటరీ ఆపరేషన్ స్ప్రేయర్, ట్రాక్టర్‌తో నడిచే స్ప్రేయర్, హైవాన్ స్ప్రేయర్ యంత్రాలు వినియోగంలో ఉన్నాయి. రైతులు తగు జాగ్రత్తలు పాటించి తమ ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

రైతులు ఎరువులు వేసేటప్పుడు చేతులకు గ్లౌజ్‌లు తప్పక వాడాలి. మందులు పిచికారీ చేసేటప్పుడు నోరుకు, ముక్కుకు మాస్క్ ధరించాలి. వీటిని వాడకపోతే ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధులు, చర్మ సంబంధిత వ్యాధులు సోకే అవకాశం ఉంది. కళ్లల్లో నీరు కారడం, తలనొప్పి, వాంతులు కావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాడిని పురుగు మందులు డబ్బాలను పొలంలో ఒక చోట రెండు అడుగులు గోతులు తీసి పాటిపెట్టాలి. పురుగుల నివారణకు పిచికారీ చేసే మందులు 8 గంటల పైబడి 11 గంటల్లోపు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల్లోపే పిచికారీ చేయాలి. మిట్ట మధ్యాహ్నం వేళలో మందులు స్ప్రే చేయరాదు.

-జి.ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె

చదువుతోనే ఉజ్వల భవిత



పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులు

గుడిపాల: చదువుతోనే ఉజ్వల భవిత అని సీఎస్ఆర్ కళాశాల కరస్పాండెంట్ లోకేష్ అన్నారు. శుక్రవారం సీఎస్ఆర్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సరస్వతి పూజ, పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు బాగా రాయాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని తెలిపారు. సమయానికి నిద్రపోయి మంచి ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచిమార్కులు సాధించి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఇష్టంగా చదివితే మంచిమార్కులు సాధించవచ్చన్నారు. పదో తరగతి తొలిమెట్టుగా భవిష్యత్‌కు ఉత్తమబాటలు వేసుకోవాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు.

శేషాపురంలోని మూడు ఇళ్లలో చోరీ





సుజాతమ్మ ఇంట్లో చిందర వందరగా ఉన్న బీరువా, ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, పోలీసులు

బంగారుపాళెం: మండలంలోని శేషాపురంలో గురువారం రాత్రి దుండగులు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగలు చోరీ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెందిన సుశీలమ్మ, సుజాత, రమేష్‌నాయుడు ఇళ్లకు తాళాలు చేసుకుని ఇతర గ్రామాలకు వెళ్లారు. ఇళ్లల్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న దుండగులు తాళాలను ఇనుపరాడ్‌తో నిగ్గతీసి ఇళ్లలోకి ప్రవేశించారు. బీరువాలు పగలగొట్టి అందులో నగలు, నగదు దోచుకుపోయారు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చుట్టు పక్కలవారు వాకబు చేయడంతో ఇళ్లలో దొంగలు పడ్డారని తెలుసుకుని బాధితులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శేషాపురం గ్రామానికి చేరుకున్నారు. చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. సుజాతమ్మ ఇంట్లో 24 గ్రాముల బంగారు నగలు, 180 గ్రాముల వెండి, రమేష్‌నాయుడు ఇంట్లో 20 వేల రూపాయలు, సుశీలమ్మ ఇంట్లో 4 గ్రాములు బంగారు నగలు చోరీకి గురైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తపాలా శాఖ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



ప్రతిభ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్ లక్ష్మణ్

చిత్తూరు కార్పొరేషన్: తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లేఖ రచన పోటీల్లో జిల్లా స్థాయిలో నగరానికి చెందిన ఎవిన్ ఫ్యాక్టో స్టీఫెన్స్ ప్రతిభ చూపించారు. వీరికి శుక్రవారం స్థానిక తపాలాశాఖ కార్యాలయంలో ఆ శాఖ సూపరింటెండెంట్ లక్ష్మణ్ ప్రశంసాపత్రం, రూ.6 వేలు ప్రోత్సాహక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దీన దయాల్ స్పర్శ యోజన కింద విద్యార్థులకు పోటీలను దేశ వ్యాప్తంగా నిర్వహించారన్నారు. ఢిల్లీ అధికారులు విజేతలను జిల్లాల వారీగా ప్రకటించారని చెప్పారు. ఇందులో మన జిల్లా పరంగా చిత్తూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థికి ఇచ్చారన్నారు. గెలిచిన వారికి ప్రతిభ ధ్రువీకరణ పత్రంతో పాటు నగదును ఖాతాలో జమ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేస్తాం



టీకాలు వేస్తున్న డాక్టర్ సాయిసుధ

గుడిపాల: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు టీకాలను ఇంటింటికీ వెళ్లి వేయనున్నట్లు పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు. మండలంలో శుక్రవారం బీఎస్‌కండ్రిగ, మంద్రిక్రిష్టాపురం, తిమ్మాపల్లె, గుడిపాలలో పశువులకు గాలికుంటు టీకాలను వేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చాలామంది రైతులు గాలికుంటు టీకాలు వేసుకుంటే పాలదిగుబడి తగ్గుతుందని వేసుకోవడం లేదని అటువంటి అపోహలను విడనాడాలని చెప్పారు. 426 పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది హసీమ్, శివ, గజపాలన్ పాల్గొన్నారు.

కారల్‌మార్క్స్‌కు నివాళి



కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కారల్‌మార్క్స్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఇస్కాఫ్, సీపీఐ నాయకులు నివాళి అర్పించారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇస్కాఫ్ రాష్ట్ర కార్యదర్శి తుంగా శ్రీధర్ రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. కామ్రేడ్ కారల్ మార్క్స్ చేసిన పోరాటాన్ని తెలియజేశారు. కార్మిక వర్గ పక్షాన నిలబడి జాతీయ ఉద్యమంలో భాగంగా 1920లో కార్మిక వర్గాన్ని సంఘటితం చేశారని వివరించారు. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ)ను స్థాపించారన్నారు. వివిధ ప్రాంతాల్లోని కమ్యూనిస్టులను ఐక్యపరిచి 1925లో కమ్యూనిస్టు పార్టీగా సంఘటితం అయ్యారని పేర్కొన్నారు. కార్మిక సంఘాలతో పాటు వివిధ ప్రజా సంఘాలను నిర్మించి జాతీయ ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యాన్ని విస్తరింపజేశారన్నారు. బహుముఖ పోరాటాలకు ప్రజా ఉద్యమాలకు ఆయన భావజాలమే మనకు దారి చూపిస్తున్నదన్నారు. కార్యక్రమంలో భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కాఫ్), సీపీఐ నాయకులు గోవిందస్వామి, రామచంద్రయ్య, నాగముని, సౌందర్యరాజన్, దుర్గ, చంద్రయ్య, మణి, దాసరిచంద్ర, విజయగౌరీ, రమాదేవి, కుమారి, రఘు, బాలాజీరావు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు





సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు, ప్రాకారోత్సవంలో వేద పండితులు, భక్తులు

- భక్తిశ్రద్ధలతో స్వామికి సుదర్శన హోమం
- భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామికి అభిషేకం చేయించారు. అనంతరం గంధంతో ప్రత్యేక అలంకరణ, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అన్నదానానికి బియ్యం, పప్పులు, కూరగాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో సుదర్శన హోమం

ఆలయంలోని మండపంలో పౌర్ణమి సందర్భంగా వీరాంజనేయస్వామికి ఉభయదారులచే భక్తి ప్రపత్తులతో సుదర్శన హోమం నిర్వహించారు. అర్చకులు కలశస్థాపన చేసి ఆరాధించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. హోమంలో ఆలయ ఈఓ హనుమంతురావు, ఉభయదారులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం

పౌర్ణమి వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ హనుమంతురావు పర్యవేక్షణలో ఉత్సవమూర్తి వీరాంజనేయస్వామికి అర్చకులు అభిషేకం, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం సుగంధపరిమళ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో కొలువుదీరిన ఆంజనేయుడు పుష్కరిణి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామికి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పౌర్ణమి వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, హరికథలు ఆలపించారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



తవణంపల్లె: పదవ తరగతి విద్యార్థుల ఓంకారం జ్యోతి ప్రజ్వలన

తవణంపల్లె: పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు పట్టుదలతో చదవాలని స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరాజులు రెడ్డి ఆకాంక్షించారు. పాఠశాల వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి శుక్రవారం నిర్వహించారు. ఉదయం కాలభైరేశ్వరాలయంలో విద్యార్థులు అభిషేకం పూజలు చేసి, మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ప్రార్థించారు. హైస్కూల్లోని సరస్వతీదేవికి ఉపాధ్యాయులు, విద్యార్థులు భక్తితో అభిషేకం, పూజలు చేశారు. అనంతరం ఓంకార జ్యోతి ప్రజ్వలన చేశారు. పలువురు వక్తలు పదవ తరగతి విద్యార్థులకు సూచనలు, సలహాలిచ్చారు. మదనపల్లెకు చెందిన శ్రీలక్ష్మీ సరస్వతి ఎడ్యుకేషనల్ ట్రస్టు మేనేజర్ ఎం.మోహన్ నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.501 చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

బంగారుపాళెం: చదువుతోనే సమాజంతో గుర్తింపు వస్తుందని హెచ్‌ఎం సుజాత అన్నారు. మండలంలోని ఎగువరాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహానికి పూలదండలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చదువుకున్నప్పుడే సమాజం అన్ని విధాలా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉందన్నారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించి పాఠశాలకు మంచిపేరును తీసుకురావాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు పదవ తరగతి పరీక్షలపై ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు బాబునాయుడు, మురగయ్య, ఇరసయ్య, శారద, శ్రీనివాసులు, జేమ్స్‌పాల్, జయంతి, రహంతుల్లా, ఉషారాణి, సత్యం, దశరథ, భారతి, ఎస్‌ఎంసీ చైర్మన్ హరిరాజు, గ్రామస్తులు బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.





బంగారుపాళెం: సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న విద్యార్థులు, సాంస్కృతిక ప్రదర్శన



తవణంపల్లె: మాట్లాడుతున్న హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి

నడకయాతన





పల్లె పండుగ పేరుతో కంకర తోలి రోడ్డుంతా పరిచేసి, వదిలేశారు. దీంతో ఆ మార్గంలో నడిచి వెళ్లాలంటే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. మండలంలోని భూమిరెడ్డిపల్లి ప్రధాన రహదారి నుంచి కాశీరాళ్ల పంచాయతీ నల్లభాతులూరు వరకు పల్లె పండుగలో భాగంగా రోడ్డు మరమ్మతులు వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు, గుత్తేదారులు పనులు ప్రారంభించారు. పాత రోడ్డును తవ్వి పెద్ద కంకర, చిన్న కంకర రాళ్లతో నింపారు. అయితే ఉన్నపళంగా పనులు ఆగిపోవడంతో ఆ మార్గం గుండా ప్రయాణించాలంటే ప్రజలకు నరకయాతన పడుతున్నారు.

-యాదమరి